# నాకు నచ్చిన పద్యం

**- కాశీనాధుని రాధ**

నీకు నచ్చిన పద్యం గురించి మా కెందుకమ్మా? నువ్వేదో చదువుకుని ఆనందిచేవుగా మరి అంతటితో ఆపకూడదూ ... అంటే అదే కదా వచ్చిన చిక్కు. మనలో చాలమంది కున్న లక్షణమే ఇది. మన ఎచీవ్‌మెంట్సు, అకాంప్లిష్‌మెంట్సు, మన సంతోషమూ, నమ్ముతారోలేదో ఒక్కోసారి మన ఫీలింగ్స్‌ని కూడా అవతలి వాళ్ళతో చెప్పుకుంటే గాని తోచిచావదు మరి. ఇది అలాంటి (అవ) లక్షణాల్లో ఒకటని నన్ను క్షమించెయ్యండి మరి. ఇంతకీ అసలు విషయం అదే పద్యానికి వద్దాం. ఇది తిక్కనగారి భారతంలోది.

అభినవజలధశ్యామంబు లగునెడ
　　లాకు జొంపంబుల ననుకరింప
సాంధ్యరాగోపమచ్చాయంబులగు పట్లు
　　కిసలయోత్కరములఁ గ్రేణి సేయ
రాజమరాళగౌరములగు చోటులు
　　తఱుమఁ బూఁ బొదలచందంబు నొంద
హారిద్రరుచిసమానాకృతు లగుతావు
　　లడరెడు పుప్పొడులట్ల మెఱయఁ
గలయ నెగసి ధరాధూళి లలితవనము
దివికి నలి గాఁ పు వోయెడు తెఱగు దాల్ప
గోగణము ముంగలిగ నేల గోడి వడగ
నడచు కౌరవరాజసైన్యంబుఁ గనియె.

\- మహాభారతం - విరాటపర్వం - చతుర్థాశ్వాసం (50)

రవిగాంచనిచో కవిగాంచున్ అన్నారు గాని "అసలు ఆ చూసింది" ఏవిటో చెప్పలేదుగా... కవి చూసేదేమిటంటే చక్కని కవితావస్తువు. అది మనం చూసినప్పుడు చక్కగా కనబడదు. కవి తన ఇంద్రజాల పటిమతో మనకి కూడా కనబడేటట్టు చేయగలడు. "ఇందుగలడందులేడు చక్రి సర్వోపగతు డెందెందు వెదకి చూచిన అందందే గలడు" అంటూ ప్రహ్లాదుడు సర్వవ్యాపకుడైన భగవంతుణ్ణే చూసినట్టే, కవి ఎక్కడ బడితే అక్కడే సౌందర్యాన్ని, సొబగులని చూడగలడు అనడానికి ఇదొక ఉదాహరణ.

కథాసందర్భం విరాటపర్వంలో ఉత్తరగోగ్రణం.

కాంతాజనాల మధ్య ఉన్న ఉత్తరునితో "యువరాజా! కౌరవులు నగరానికి ఉత్తరదిశనున్న మన గోగణాలని తరలించుకు పోతున్నారు. నువ్వు వచ్చి రక్షించవయ్యా!" అని గవాధ్యక్షుడు మనవి చేయగా, ఉత్తరుడు పొంగిపోయి "ఎత్తునఁ గొందు కౌరవులనెల్లను మార్కొని, రేని గోవులం దెత్తు" అంటూ, బృహన్నలని సారధిగా చేసికొని బయలుదేరి ఊరి పొలిమేరలకు చేరినప్పటిది ఈ పద్యం. అంతవరకు అంతఃపురంలో అంగనామణుల మధ్య నున్న ఉత్తరుని మనోస్థితికి ఎంతో చక్కగా అమరినభావం.

గోగణము ముంగలిగ నేల గోడివడగ, ఆకాశాన్ని అంటే అంతటి ధూళిని రేపుతూ నడుస్తున్న కౌరవరాజసైన్యం - ఉత్తరుడికి కనబడ్డ దృశ్యం. అరివీరభయంకరమై, భీష్మ ద్రోణ కృపాది మహా వీరాధివీరులతో నిండిన కౌరవసైన్యాన్ని చూసి భయపడంటం దాకా ఉత్తరుడి మనసు పోలేదు. సైన్యం కంటే ముందుగా ధూళే కళ్ళబడుతోంది. దాన్నే వర్ణిస్తున్నారు తిక్కన్నగారీ పద్యంలో...

మనబోటి వాళ్ళు రోడ్డుమీద బస్సో, లారీనో పోతుంటే రేగిన దుమ్ము చూడగానే, జేబుల్లోంచో, బ్యాగుల్లోంచో చేతిరుమాలు పైకిలాగి, విసుగ్గా మొహం చిట్లించుకుంటూ ముక్కు మూసుకుంటాం... పైన చెప్పింది కాస్తా కూస్తా దుమ్మా? రథ గజ తురగపదాతిబలాలతో మహాసముద్రం లాంటి కురుబలం అపారమైన గోగణంతో కలిసి రేపుతున్న ధూళి. మరి తిక్కన గారేం చేసారో (చూసారో) చూద్దాం. నేల మీదున్న రకాల మట్టినిబట్టి, మధ్యలోంచి దూసుకు పోతున్న సూర్యకిరణకాంతులవల్ల దుమ్ముకూడా కొంతకొంత మేర ఒక్కోరంగులో కనబడుతోంది.

క్రొంగొత్త మేఘాలని పోలి నల్లరంగులో కనబడుతున్న చోట ఆకుల గుంపులాగానూ, సంధ్యారాగంలా ఎర్రరంగులో కనబడుతున్న మేర చిగురాకుల్లానూ, రాజహంసలను బోలి తెల్లగా తోస్తున్న చోట్ల పూపొదలున్నట్టుగాను, పసుపువన్నెలతో రాజిల్లే ధూళిచక్కని పుప్పొడులకు మల్లెను కనబడుతూ పైకెగసిన ఈ ధూళి అనే ముచ్చటైన పూలతోట దివిని ఉన్న తమ ఏలిక నందనవనాన్ని దర్శించటానికి తరలి పోతోందేమో అన్నట్టుగా ఉందట....

చేబట్టిన వస్తువు దుమ్ము, చూపించినది లలితోద్యానవనం. చూసారా ఈ ఇంద్రజాలం. అదే కవికి మనకీ ఉన్న తేడా. ఇతరులు కనీ, వినీ ఎరుగని అందాలని చూడగలిగే సహృదయత, తక్కిన వాళ్ళకి చూపించగల సామర్థ్యం.